క్లుప్తంగా

చెరువు అభివృద్ధిపై గ్రామసభ

నాగులుప్పలపాడు: గ్రామంలోని చెరువు అభివృద్ధి, మౌలిక వసతులపై సోమవారం గ్రామ సభ ఏర్పాటు చేశారు. గ్రామ సర్పంచ్ బోలే లక్ష్మీ ఆంజనేయులు అధ్యక్షతన ఏర్పాటు చేసిన గ్రామసభలో స్థానిక చెరువు నీరు వాడుకోవడానికి పనికిరానందున ఆ నీటిని మోటార్లతో తోడిపోసి చెరువు చుట్టూ పరిసరాలను శుభ్రం చేసి తిరిగి కొమ్మమూరు కాలువ నుంచి నీటిని నింపేలా చర్యలు తీసుకోవాలని ప్రతిపాదించారు. అలాగే జెడ్పీ నిధులతో పాటు మండల పరిషత్ నిధులతో గ్రామంలో సీసీ రోడ్ల నిర్మాణాలకు ప్రతిపాదనలు తయారు చేయనున్నట్లు చెప్పారు. గ్రామ సభలో ఉప సర్పంచ్ ఊదరగుడి మార్తమ్మ, పంచాయతీ సెక్రటరీ రంగారెడ్డి, గ్రామస్తులు పాల్గొన్నారు.

కోర్టు పరిధిలో ఉన్న స్థలానికి పొజిషన్ సర్టిఫికెట్

మద్దిపాడు: స్థానిక బొద్రాయి సెంటర్ వద్ద ఉన్న స్థలం కోర్టు వివాదంలో ఉండగా, పొజిషన్ సర్టిఫికెట్ ఇచ్చారని, ఆ స్థలంలో చేస్తున్న నిర్మాణాలను ఆపాలని సోమవారం తహసీల్దార్ గ్రీవెన్స్‌లో తహసీల్దార్ ఆదిలక్ష్మికి ఒంగోలుకు చెందిన అడపాల భాగ్యలక్ష్మి ఫిర్యాదు చేశారు. సదరు స్థలంలో నిర్మాణాలకు పంచాయతీ నుంచి కూడా ఎటువంటి అనుమతులు లేవని ఆమె తెలిపారు. సదరు స్థల వివాదం హైకోర్టులో నడుస్తుండగా, స్థానిక తహసీల్దార్ కార్యాలయం నుంచి సుద్దపల్లి సుబ్బారావు అనే వ్యక్తికి పొజిషన్ సర్టిఫికెట్ ఇచ్చారని తమకు తెలిసిందన్నారు. ఒకవేళ సర్టిఫికెట్ ఇచ్చి ఉంటే దానిని రద్దు చేయాలని తహసీల్దార్‌కు విజ్ఞప్తి చేశారు.

నేడు జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం

మద్దిపాడు: జాతీయ నులి పురుగుల నివారణ దినోత్సవం సందర్భంగా మంగళవారం మండలంలోని అన్ని పాఠశాలలు, కళాశాలల్లో విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలు ఇచ్చి మింగించనున్నట్లు మద్దిపాడు పీహెచ్‌సీ డాక్టర్ శ్రావణ్ ఒక ప్రకటనలో తెలిపారు. మండల వ్యాప్తంగా 57 పాఠశాలలు, ప్రాథమికోన్నత పాఠశాలలు, 3 కళాశాలలు, 62 అంగన్‌వాడీ సెంటర్లలో 9171 మంది పిల్లలకు మాత్రలు సిద్ధం చేసినట్లు చెప్పారు. మధ్యాహ్న భోజనం అనంతరం చిన్నారులందరికీ మాత్రలు వేయనున్నట్లు తెలిపారు. పాఠశాలలకు రాని వారికి ఈ నెల 20వ తేదీ మాత్రలు ఇవ్వనున్నట్లు తెలిపారు. ఎంఎల్‌హెచ్‌పీలు, ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు ఈ కార్యక్రమంలో పాల్గొనాలని ఆదేశించారు.

దర్శి బాలునికి ఆర్థికసాయం



చెక్కు అందిస్తున్న కలెక్టర్

ఒంగోలు సబర్బన్: దర్శి పట్టణానికి చెందిన గల్లెపోగు యలమంద, ప్రశాంతి దంపతుల 5 సంవత్సరాల కుమారుడికి కలెక్టర్ ఏ తమీమ్ అన్సారియా రూ.1.50 లక్షల విలువైన చెక్కు అందించారు. ఆ చిన్నారి పోలియోతో బాధపడుతున్న నేపథ్యంలో స్థానిక కలెక్టర్ చాంబర్‌లో సోమవారం చెక్కు అందజేశారు.

మాజీ సర్పంచ్ నుంచి నిధులు రికవరీ చేయాలి

సంతనూతలపాడు (చీమకుర్తి రూరల్): సంతనూతలపాడు గ్రామ సర్పంచ్‌గా 2013–18లో పనిచేసిన ఆర్.అంకారావు నుంచి నిధులు రికవరీ చేయాలని కోరుతూ కుంచాల వీరబ్రహ్మయ్య సోమవారం ఒంగోలులో జరిగిన కలెక్టర్ గ్రీవెన్స్‌సెల్‌లో వినతిపత్రం అందజేశారు. ఇప్పటికే కలెక్టర్ తమీమ్ అన్సారియా అధికారులను ఆదేశించి ఉన్న నేపథ్యంలో ఆ నివేదిక మేరకు ఏపీ రికవరీ యాక్టు 1964 ప్రకారం అంకారావు రూ.30,48,373 ప్రభుత్వానికి చెల్లించాల్సి ఉందన్నారు. ఆ మొత్తాన్ని రికవరీ చేయడంతో పాటు అతనిపై క్రిమినల్ కేసు నమోదు చేయాలని డివిజనల్ పంచాయతీ ఆఫీసర్, సంతనూతలపాడు ఈఓఆర్డీలను ఆదేశించినప్పటికీ, ప్రొసీడింగ్ ఆర్డర్స్ ఉన్నప్పటికీ అధికారులు ఇంతవరకు రికవరీ చేయలేదని, ఈ విషయమై స్పెషల్ ఆఫీసర్‌ని నియమించి త్వరితగతిన రికవరీ చేయించి సంతనూతలపాడు గ్రామ పంచాయతీలో జమ చేసేలా చూడాలని కోరారు.

నేడు నులిపురుగుల నివారణ మందుల పంపిణీ

ఒంగోలు టౌన్: జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లాలో 1 నుంచి 19 సంవత్సరాల్లోపు వయసు గల 5,96,751 మంది పిల్లలు, యువకులకు మంగళవారం నులిపురుగుల నివారణ మందులు ఉచితంగా పంపిణీ చేయనున్నట్లు జిల్లా వైద్యారోగ్య శాఖాధికారి డాక్టర్ టి.వెంకటేశ్వర్లు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఏదైనా కారణాలతో నేడు ఆల్బెండజోల్ మాత్రలు వేసుకోని పిల్లలకు తిరిగి ఈ నెల 20వ తేదీ ఉచితంగా మందులు పంపిణీ చేయనున్నట్లు చెప్పారు. పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో మాత్రలు పంపిణీ చేయనున్నట్లు తెలిపారు.

కమిషనర్‌కు పదోన్నతి

ఒంగోలు సబర్బన్: ఒంగోలు నగరపాలక సంస్థ కమిషనర్ వెంకటేశ్వరరావు స్పెషల్ గ్రేడ్ కమిషనర్‌గా పదోన్నతి పొందారు. ఆ మేరకు రాష్ట్ర ప్రభుత్వ ప్రిన్సిపల్ సెక్రటరీ సురేష్ కుమార్ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. రాష్ట్ర మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ అండ్ అర్బన్ డెవలప్‌మెంట్ విభాగం జీఓ ఆర్‌టీ నంబర్–788 విడుదల చేశారు.



ముప్పవారిపాలెం గ్రామ కమిటీతో మాజీ మంత్రి మేరుగు నాగార్జున



కేవీ పాలెం గ్రామ కమిటీతో మేరుగు నాగార్జున

గ్రామ కమిటీలతో పార్టీ బలోపేతం

- వైఎస్సార్ సీపీ సంతనూతలపాడు నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ మంత్రి మేరుగు నాగార్జున

చీమకుర్తి రూరల్: వైఎస్సార్ సీపీని మరింత బలోపేతం చేసేందుకు గ్రామ కమిటీలను నియమిస్తున్నట్లు ఆ పార్టీ సంతనూతలపాడు నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ మంత్రి మేరుగు నాగార్జున తెలిపారు. ఆదివారం రాత్రి చీమకుర్తి మండలంలోని గోనుగుంట, ముప్పవారిపాలెం, కేవీ పాలెం గ్రామాల్లో మేరుగు నాగార్జున ఆధ్వర్యంలో వైఎస్సార్ సీపీ గ్రామ కమిటీలు నియమించారు. పార్టీ మండల అధ్యక్షుడు పమిడి వెంకటేశ్వర్లు అధ్యక్షత వహించగా, ఎంపీపీ యద్దనపూడి శ్రీనివాసరావు, జెడ్పీటీసీ వేమా శ్రీనివాసరావు, ఉపాధ్యక్షుడు శ్రీదర్ల శేషు, యూత్ అధ్యక్షుడు వెంగరెడ్డి, జిల్లా కార్యదర్శి ఓబుల్‌రెడ్డి, నల్లూరి చంద్ర, తన్నీరు శ్రీనివాసరావు, బొడ్డు కోటేశ్వరరావు, ఉప్పలపాటి వెంకటరావు, ఎర్రగుంట్ల మోహన్, వసంతరావు, ఏలూరు సురేష్, పేరాబత్తిన పేరయ్య, వాకా కోటిరెడ్డి, కందుల డేనియల్, పాటిబండ్ల గంగయ్య, కుంచాల రాంబాబు, సంతోష్, మాగులూరి ఇమ్మానియేలు, బొడ్డపాటి హరిబాబు, మండలంలోని పార్టీ అనుబంధ విభాగాల నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

ముప్పవారిపాలెం గ్రామ కమిటీ...

అధ్యక్షునిగా కుంచాల రాంబాబు, ఉపాధ్యక్షులుగా చింతపట్ల హరీష్, బక్క జయరావు, ప్రధాన కార్యదర్శులుగా బక్క శ్రీనివాసరావు, కుంచాల అశోక్, కార్యదర్శులుగా తాటిబండ్ల నెహెమ్యా, ముప్వ బ్రహ్మారెడ్డి, బొడ్డు రాఘవరావు, చింతపట్ల నాగాంజనేయులు, సీహెచ్ రాము, కార్యవర్గ సభ్యులుగా ఏసుపోగు సంతోషం, కుంచాల మనోహర్, పిగిలి శ్రీనివాసరావు, ముప్వ నరసింహారెడ్డి, బక్క యోహాను, బక్క ఆదాము, బూత్ కన్వీనర్‌గా తన్నీరు లక్ష్మణరావు, ఎస్సీ సెల్ అధ్యక్షునిగా బక్క సుధాకర్‌రావు, బీసీ సెల్ అధ్యక్షునిగా కుంచాల పున్నారావు, ఎస్టీ సెల్ అధ్యక్షునిగా సేవూరి రాంబాబు, యూత్ వింగ్ అధ్యక్షునిగా రెడ్డిబోయిన మాధవరావు, రైతు విభాగం అధ్యక్షునిగా బొడ్డు వెంకట సురేష్‌బాబు, సేవాదళ్ అధ్యక్షునిగా కల్లగుంట దుర్గారావు, విద్యార్థి విభాగం అధ్యక్షునిగా దర్శిగుంట బ్రహ్మయ్య, మహిళా విభాగం అధ్యక్షురాలిగా బక్క కవితను నియమించారు.

కేవీ పాలెం గ్రామ కమిటీ...

అధ్యక్షునిగా ఎర్రగుంట్ల మోహన్‌రావు, ఉపాధ్యక్షులుగా నల్లూరి నారాయణ, పేరాబత్తిన పేరయ్య, ప్రధాన కార్యదర్శులుగా వేముల బాలకృష్ణ, చింతపల్లి సుధాకర్, కార్యదర్శులుగా మంద ఇమ్మానేలు, రాతికింద లక్ష్మీనరసింహం, రేవూరి శ్రీనివాసరావు, ముప్పరపు సతీష్,, పోరూరి శ్రీనివాసరావు, గడ్డం వరప్రసాద్, కార్యవర్గ సభ్యులుగా బక్క వినోద్, పారాబత్తిన చిరంజీవి, దావులూరి నరసింహారావు, పూనాటి రాములు, మద్దులోరి సుబ్బారావు, వేమా చంద్రయ్య, వేమా గోవిందు, బూత్ కన్వీనర్లుగా పమిడి శంకరం, గోరంట్ల శ్రీనివాసరావు, వేమా మాల్యాద్రి, ఎస్సీ సెల్ అధ్యక్షునిగా వేమా శివన్నారాయణ, బీసీ సెల్ అధ్యక్షునిగా కంకణంపాటి పూర్ణచంద్రరావు, ఎస్టీ సెల్ అధ్యక్షునిగా పూనూరి సునీల్, యూత్ వింగ్ అధ్యక్షునిగా గడ్డం మరియదాసు, రైతు విభాగం అధ్యక్షునిగా నల్లూరి చెంచారావు, సేవాదళ్ అధ్యక్షునిగా రాతికింది సిద్ధార్థ, విద్యార్థి విభాగం అధ్యక్షునిగా దాసరి ప్రసన్న కుమార్, మహిళా విభాగం అధ్యక్షురాలిగా టి.శేషమ్మను నియమించారు.



మేరుగు నాగార్జునను సన్మానిస్తున్న గోనుగుంట గ్రామ కమిటీ నాయకులు

రంగస్థల కళాకారులను ప్రభుత్వం ఆదుకోవాలి

ఒంగోలు టౌన్: సమాజ వికాసం కోసం అహర్నిశలు పాటుపడుతూ పేదరికంతో బాధపడుతున్న రంగస్థల కళాకారులను ప్రభుత్వం ఆదుకోవాలని జిల్లా రంగభూమి కళాకారుల సంఘం కార్యదర్శి అంగలకుర్తి ప్రసాద్ విజ్ఞప్తి చేశారు. రంగస్థల కళాకారుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ సోమవారం ప్రకాశం భవనం వద్ద నిరసన ప్రదర్శన నిర్వహించారు. వివిధ పౌరాణిక, సాంఘిక నాటకాల్లోని ప్రసిద్ధి చెందిన పాత్రలతో సీవీఎన్ రీడింగ్ రూం వద్ద ఉన్న ఘంటసాల వెంకటేశ్వరరావు విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించిన కళాకారులు అక్కడ నుంచి ర్యాలీగా బయలుదేరి నెల్లూరు బస్టాండు సెంటర్ వరకు చేరుకొని రంగస్థల నటులు బండారు రామారావు, డీవీ సుబ్బారావు విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అక్కడ నుంచి ప్రకాశం భవనం వద్దకు చేరుకున్న కళాకారులు పద్యాలు, డైలాగులతో హోరెత్తించారు. అనంతరం అంగలకుర్తి ప్రసాద్ మాట్లాడుతూ జిల్లాలోని వివిధ దేవాలయాల్లో జరిపే ఉత్సవాల్లో సంప్రదాయ, పౌరాణిక నాటకాల ప్రదర్శనకు అవకాశం కల్పించాలని, ఒంగోలులోని నెల్లూరు బస్టాండ్ వద్ద ఉన్న ఓపెన్ థియేటర్‌ను ప్రదర్శనలకు అనుకూలంగా కళాకారులకు కేటాయించాలని కోరారు. జిల్లాలోని కళాకారులందరికీ ప్రభుత్వ గుర్తింపు కార్డులు మంజూరు చేయాలని, కళాకారులకు బస్సు ప్రయాణాల్లో రాయితీ కల్పించాలని, 50 ఏళ్లు దాటిన కళాకారులకు రూ.10 వేల పెంఛన్ సౌకర్యం కల్పించి ఆదుకోవాలని కోరారు. కళాకారులకు నివాస స్థలాలను కేటాయించి ప్రత్యేక కాలనీ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ప్రదర్శన అనంతరం కలెక్టర్ కార్యాలయంలోని స్పందనలో డీఆర్‌ఓకు వినతి పత్రం సమర్పించినట్లు తెలిపారు. కార్యక్రమంలో ప్రకాశం జిల్లా పౌరాణిక రంగస్థల కళాకారుల ఐక్యవేదిక అధ్యక్షుడు వీఎస్ రెడ్డి, వీరాంజనేయ నాట్య మండలి కార్యదర్శి మాకా ఆంజనేయులు, ది ప్రకాశం జిల్లా సంగీత కళాకారుల సమాఖ్య అధ్యక్షుడు ఎస్కే బాబు, అనంతలక్ష్మి, గూడూరి సుధారాణి, యశోద, శ్రీదేవి, మిడిసల మల్లికార్జునరావు, పాదిలి బాల గురవయ్య తదితరులు పాల్గొన్నారు.



నిరసన ప్రదర్శన నిర్వహిస్తున్న రంగస్థల కళాకారులు

15వ తేదీకల్లా దత్తత పూర్తి చేయాలి

ఒంగోలు సబర్బన్: జిల్లాలో బంగారు కుటుంబాల దత్తత ప్రక్రియను ఆగస్టు 15వ తేదీ నాటికి పూర్తి చేయాలని కలెక్టర్ ఏ తమీమ్ అన్సారియా ఎంపీడీఓలు, మున్సిపల్ కమిషనర్లను ఆదేశించారు. సోమవారం స్థానిక కలెక్టర్ క్యాంప్ కార్యాలయం నుంచి ఎంపీడీఓలు, మున్సిపల్ కమిషనర్లు, డీఎల్‌డీవోలు, డీఎల్పీఓలు, ఈఓఆర్డీలు, ఆర్‌డబ్ల్యూఎస్, పబ్లిక్ హెల్త్ ఇంజినీర్లు, తదితర అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి మాట్లాడారు. పీ–4 కార్యక్రమం పురోగతి, హౌసింగ్ పురోగతి, జీఎస్‌డబ్ల్యూఎస్, ఉపాధి హామీ పథకం పనుల పురోగతి, తదితర అంశాలపై సమీక్షించి దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ దత్తత ప్రక్రియ పూర్తి చేయడంతో పాటు ప్రభుత్వం మంజూరు చేసిన పక్కా గృహాల నిర్మాణాలలో పురోగతి కనిపించాలన్నారు. జీఎస్‌డబ్ల్యూఎస్ అంశాలకు సంబంధించి పెండింగ్‌లో ఉన్న వాటిని వేగంగా పూర్తి చేయాలని, పిల్లల ఆధార్ సీడింగ్‌పై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. ఉపాధి హామీ పథకం పనుల పురోగతిపై సమీక్షించారు.

బౌద్ధ స్ఫూర్తితో రాజ్యాంగాన్ని అమలు చేయాలి

ఒంగోలు వన్‌టౌన్: బౌద్ధ స్ఫూర్తితో రాజ్యాంగాన్ని అమలు చేయాలని కోరుతూ ఒంగోలు నగరంలో సోమవారం బౌద్ధ ధర్మ ప్రచార పాదయాత్ర నిర్వహించారు. శ్రావణ బౌద్ధ పౌర్ణమి సందర్భంగా బౌద్ధ ధర్మ ప్రచార కేంద్రం ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ పాదయాత్రలో విశ్రాంత ఆర్‌డీ కె.రాఘవరావు పాల్గొని మాట్లాడారు. దేశ ప్రజలు అభివృద్ధి చెందితేనే నిజమైన దేశాభివృద్ధి అవుతుందన్నారు. అందుకోసం సర్వ మానవ సంక్షేమ కారకమైన బౌద్ధ స్ఫూర్తితో రాజ్యాంగాన్ని అమలు చేయాలని పాలకులకు విజ్ఞప్తి చేశారు. ఓపీడీఆర్ నాయకుడు సీహెచ్ సుధాకరరావు మాట్లాడుతూ పాలకులు కుల, మత, ప్రాంతీయ విభేదాలను ప్రోత్సహిస్తున్నారన్నారు. ఉత్పత్తి శక్తులను, మహిళలను నిర్లక్ష్యం చేస్తున్నారన్నారు. పాత బైపాస్, మంగమూరు రోడ్డు జంక్షన్, మూడు బొమ్మల సెంటర్, గాంధీనగర్ 1వ లైను, 4వ లైను మీదుగా జెడ్పీ కాలనీ మెయిన్ రోడ్డు వరకూ పాదయాత్ర నిర్వహించారు. స్థానిక మూడు బొమ్మల సెంటర్‌లోని గౌతమ బుద్ధుడు, మహాత్మా జ్యోతీరావుపూలే, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహాలకు నివాళులర్పించారు. కార్యక్రమంలో పి.సత్యం, ఉపాసకులు జి.హరిప్రసాదరావు, డి.సుందరరావు, ఆచారి, ఆంజనేయులు, జార్జి, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా పోలేరమ్మ కొలుపులు

తాళ్లూరు: మండలంలోని నాగంబొట్లపాలెంలో తొమ్మిది రోజులుగా జరుగుతున్న పోలేరమ్మ తల్లి కొలుపులు సోమవారం ఘనంగా ముగిశాయి. గ్రామ ప్రజలు భక్తిశ్రద్ధలతో సంప్రదాయ పద్ధతులతో పూజలు చేశారు. ముందుగా అమ్మవార్లను పూలతో అలంకరించారు. పసుపు–కుంకుమ, చీర, సారె పెట్టుకున్నారు. మహిళలు పొంగళ్లు, నైవేద్యాలు, పండ్లు సమర్పించారు. కొబ్బరికాయలు కొట్టి మొక్కులు తీర్చుకున్నారు.



ప్రత్యేక అలంకరణలో పోలేరమ్మ అమ్మవారు

త్రిపురాంతకం గడ్డ..జగనన్న అడ్డా!

- త్రిపురాంతకేశ్వరుడి ఆశీస్సులతో రెపరెపలాడిన వైఎస్సార్ సీపీ జెండాలు
- ఎమ్మెల్యే తాటిపర్తిని ఘనంగా ఆహ్వానించిన నాయకులు

త్రిపురాంతకం (యర్రగొండపాలెం): త్రిపురాంతకేశ్వరుడి ఆశీస్సులతో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జెండాలు రెపరెపలాడాయి. సోమవారం త్రిపురాంతకంలోని ఆర్యవైశ్య నిత్య అన్నదాన సత్రంలో ఏర్పాటు చేసిన బాబు ష్యూరిటీ–మోసం గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. మండలంలోని వివిధ గ్రామాల నుంచి ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు బస్టాండ్ సెంటర్‌లో ఉన్న వైఎస్సార్ విగ్రహం వద్దకు చేరుకున్నారు. ఈ తరుణంలో వర్షం జల్లులు కురవడం ప్రారంభమయ్యాయి. దాదాపు 3 కిలో మీటర్ల దూరంలో ఉన్న సభాస్థలం వద్దకు ర్యాలీగా వెళ్లేందుకు చేసిన సన్నాహాలు విఫలం అవుతాయనుకున్నారు. అయితే త్రిపురాంతకేశ్వరుడు కరుణ చూపడంతో వర్షం జల్లులకే పరిమితమైంది. ఆ ఆనందోత్సాహంతో అక్కడ చేరిన యువకులు త్రిపురాంతకం గడ్డ జగనన్న అడ్డా.. తాటిపర్తి చంద్రశేఖర్ నాయకత్వం వర్ధిల్లాలి.. అంటూ నినాదాలు చేశారు. ముందుగా వైఎస్సార్ విగ్రహం వద్దకు చేరిన ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్‌ను నాయకులు శాలువా కప్పి ఘనంగా ఆహ్వానించారు. ఆయన వైఎస్సార్ విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. అక్కడి నుంచి వైఎస్సార్ సీపీ జెండాలు పట్టుకొని పట్టణ ప్రధాన వీధిలో ర్యాలీ చేశారు. త్రిపురాంతకేశ్వరుడి ఆలయానికి సమీపంలో ఉన్న సత్రంలో ఏర్పాటు చేసిన సభ వద్దకు యువకులు మోటారు బైక్ ర్యాలీ నిర్వహించారు. ఎమ్మెల్యే మోటారు బైక్‌పై ఆ ర్యాలీలో పాల్గొని యువతలో నూతన ఉత్తేజాన్ని నింపారు. ర్యాలీలో జగన్ నినాదం మిన్నంటింది. 3 కిలోమీటర్ల వరకు సాగిన ర్యాలీని అభిమానులు, పార్టీ సానుభూతిపరులు చూసి ఎంతో ఆనందంగా కదం తొక్కారు. సభలో ఎన్నికల ముందు బాబు ఇచ్చిన ష్యూరిటీ పత్రాలను ప్రదర్శించే సమయంలో కూటమి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఎంపీపీ ఆళ్ల సుబ్బమ్మ, మాజీ ఎంపీపీ ఆళ్ల ఆంజనేయరెడ్డి, జెడ్పీటీసీ మాకం జాన్‌పాల్, వైస్ ఎంపీపీ పాటిబండ్ల కృష్ణ, పార్టీ మండల కన్వీనర్లు సింగారెడ్డి పోలిరెడ్డి, గంటా వెంకటరమణారెడ్డి, ఏకుల మునలారెడ్డి, పి.కృష్ణారెడ్డి, వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి కొప్పర్తి చిన్న ఓబులరెడ్డి, మహిళా విభాగం జిల్లా కార్యదర్శి ఆర్.అరుణాబాయి, ముస్లి మైనార్టీ విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి షేక్ బుజ్జి, రైతు విభాగం రాష్ట్ర కార్యదర్శి వై.వెంకటేశ్వరరెడ్డి, ఐటీ విభాగం జిల్లా అధ్యక్షుడు దొందేటి నాగేశ్వరరెడ్డి, మండల అధ్యక్షుడు పి.నాగేశ్వరరెడ్డి, ఎస్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు పి.రాములు నాయక్, వివిధ విభాగాల నాయకులు రాచగొర్ల పిచ్చయ్య, ఆళ్ల కృష్ణారెడ్డి, సయ్యద్ జబీవుల్లా, ఎస్.రంగబాబు, సాయిపునేని సుబ్బారావు, శార, షుక్రూనాయక్, కె.వెంకటేశ్వర్లు, కంభపు వెంకటేశ్వర్లు, సుబ్రహ్మణ్యం, కాశిరెడ్డి, నారాయణరెడ్డి, జి.బాలకోటిరెడ్డి, శాంబిరెడ్డి, బాలు నాయక్, నాసర్‌వలి, కోటి, మోహన్‌దాస్, మీరావలి, వెంకళరెడ్డి పాల్గొన్నారు.



క్యూ ఆర్ కోడ్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే తాటిపర్తి, వైఎస్సార్ సీపీ నేతలు

పీఆర్‌సీని వెంటనే ప్రకటించాలి



ఉద్యోగుల సమస్యలపై ఏపీజీఈఏ రాష్ట్ర అధ్యక్షుడు స్పీచ్‌ని ఆలకిస్తున్న ట్రెజరీ ఉద్యోగులు

- ఉద్యోగులకు రావాల్సినవేవీ ఇచ్చే పరిస్థితిలో ప్రభుత్వం లేదు
- ఏపీజీఈఏ యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రాజ్‌కుమార్

ఒంగోలు సబర్బన్: ప్రభుత్వ ఉద్యోగులకు పీఆర్‌సీని వెంటనే ప్రకటించాలని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కే రాజ్ కుమార్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు ఒంగోలు నగరంలోని జిల్లా ఖజానా కార్యాలయంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం (ఏపీజీఈఏ) ఆధ్వర్యంలో ×రండి టీ తాగుతూ మాట్లాడుకుందాం× కార్యక్రమం సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షుడు సూర్యనారాయణ సందేశాన్ని ప్రభుత్వ ఉద్యోగులకు వినిపించారు. ఈ సందేశంలో పీఆర్‌సీని వెంటనే ప్రభుత్వం ప్రకటించాలన్నారు. అదేవిధంగా ఉద్యోగులకు సరెండర్ లీవ్స్ నగదు రూపంలో రావాల్సి ఉందన్నారు. డీఏలు రావాల్సి ఉందన్నారు. ఇవన్నీ ప్రస్తుతం ప్రభుత్వం ఇచ్చే పరిస్థితి లేదని తరువాత ఏవిధమైన కార్యాచరణ చేపడదామన్న అంశంపై త్వరలో నిర్ణయం తీసుకుంటామని చెప్పారు. ఈ నెల 5వ తేదీ నుంచి ఏపీజీఈఏ ఆధ్వర్యంలో ప్రతి ప్రభుత్వ కార్యాలయంలో ఉద్యోగుల సమస్యలపై చర్చిస్తారన్నారు. ఈ సందర్భంగా ఏపీజీఈఏ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కే.రాజ్‌కుమార్ మాట్లాడుతూ ఏపీజీఈఏ ఆధ్వర్యంలో మూడు నెలల పాటు ప్రభుత్వ ఉద్యోగుల సమస్యలపై ప్రతి విభాగంలో అందరితో చర్చించాక ఎలాంటి కార్యాచరణ చేపట్టాలో నిర్ణయం తీసుకుంటారన్నారు. కార్యక్రమంలో ప్రకాశం జిల్లా ప్రభుత్వ ఉద్యోగుల సంఘం (ఏపీజీఈఏ) అధ్యక్షుడు చిన్నపరెడ్డి కిరణ్ కుమార్ రెడ్డి, జిల్లా కార్యదర్శి వరకుమార్, కోశాధికారి రంగారెడ్డి, ఒంగోలు పట్టణ అధ్యక్షుడు మోటా శ్రీనివాసరావు, మహిళా విభాగం అధ్యక్షురాలు డాక్టర్ రజిత మానస, సంఘ నాయకులు జిల్లా చంద్రశేఖర్, కొనికి శ్రీనివాసులు, నివేదిత అలెక్స్, సుజాతలతోపాటు ట్రెజరీ ఉద్యోగులు దేవరాజు, సురేష్, సుబ్బారావు, నితీష్ రెడ్డి, ఉమామహేశ్వరరావు, వందన శ్రీనివాసరావు, శ్రీ లక్ష్మి, ఆంజనేయులు, శ్రీనాథ్ వెంకటేశ్వర్లు, వేముల సుబ్బారావు, కే రవి కుమార్, వెంకట్రావు, నారాయణమ్మ, అంజలి, బాబావాలి తదితరులు పాల్గొన్నారు.

ఫ్యామిలీ క్లబ్ ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలు

ఒంగోలు మెట్రో: ఫ్యామిలీ క్లబ్ ఆధ్వర్యంలో సోమవారం పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. స్థానిక జీజీహెచ్‌లో రోగుల అటెండర్లకు మధ్యాహ్న భోజనం అందించారు. సత్యసాయి ప్రేమ సేవా ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న భోజన వితరణ కేంద్రంలో శ్రీ సత్యసాయి బాబాకి పూజా కైంకర్యాలు నిర్వహించిన అనంతరం 300 మందికి భోజనం అందించారు. అనంతరం హౌసింగ్ బోర్డ్ కాలనీలోని బొమ్మరిల్లు అనాథ పిల్లల సంరక్షణ కేంద్రంలో 60 మంది పిల్లలకు భోజనాలు, పండ్లు, పుస్తకాలు పంపిణీ చేశారు. ఆరు పేద కుటుంబాలకు నెలకు సరిపడా నిత్యవసర సరుకులు, గో సంఘంలోని గోవులకు గ్రాసం పంపిణీ చేశారు. ఫ్యామిలీ క్లబ్ వ్యవస్థాపక అధ్యక్షుడు పొట్టి వీరరాఘవరావు, తదితరులు పాల్గొన్నారు.



బొమ్మరిల్లు కేంద్రంలో భోజనాలు, పండ్లు పంపిణీ చేస్తున్న ఫ్యామిలీ క్లబ్ సభ్యులు

ఆటో–ఆర్టీసీ బస్సు ఢీ

- మహిళకు తీవ్రగాయాలు

నాగులుప్పలపాడు: ఆటో – ఆర్టీసీ బస్సు ఢీకొని మహిళకు తీవ్రగాయాలైన సంఘటన సోమవారం ఉప్పుగుండూరులోని కరెంట్ ఆఫీస్ వద్ద జరిగింది. మండలంలోని ముప్పాళ్ల గ్రామానికి చెందిన బొడ్డు వెంకటరమణ శనగల క్లీనింగ్ కోసం ముప్పాళ్ల నుంచి ఆటోలో 15 బస్తాలు వేసుకుని ఉప్పుగుండూరు వస్తోంది. అదే సమయంలో చీరాల నుంచి ఒంగోలు వెళ్తున్న ఆర్టీసీ బస్సు వేగంగా మలుపు తిరుగుతూ ఆటోను ఢీకొట్టింది. ఆటోలో ఉన్న వెంకటరమణ కాళ్లకు తీవ్రగాయాలవడంతో స్థానికులు ఒంగోలులోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం ఆమె చికిత్స పొందుతోంది.



ఘటన స్థలంలో ఆర్టీసీ బస్సు – ఆటో

రేపటి శాంతియుత ధర్నాను విజయవంతం చేయాలి

దర్శి: ఆంధ్రప్రదేశ్ ప్రైవేట్ డిగ్రీ కాలేజ్ మేనేజ్‌మెంట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 13న తాడేపల్లిలోని సోషల్ వెల్ఫేర్ కార్యాలయం వద్ద నిర్వహించే శాంతియుత ధర్నాను విజయవంతం చేయాలని అసోషియేషన్ రాష్ట్ర సెక్రటరీ డాక్టర్ పి.పెద్దిరాజు ఒక ప్రకటనలో కోరారు. రెండేళ్లుగా నిధులు విడుదల చేయకుండా ప్రభుత్వం పెండింగ్‌లో ఉంచడం శోచనీయమన్నారు. ఈ విషయమై అసోసియేషన్ నాయకులు పలుమార్లు ప్రభుత్వానికి పలు విధాలుగా విన్నవించినా ప్రభుత్వ పెద్దల నుంచి ఎటువంటి స్పందన లేకపోవడం విచారకర మన్నారు. రాష్ట్ర అసోసియేషన్ నాయకులు ఫిబ్రవరి 3వ తేదీన విద్యాశాఖ మంత్రి లోకేశ్‌ను కలిసి డిగ్రీ కళాశాలల సమస్యలు తెలియజేశామని, ఆ తర్వాత మెయిల్స్ ద్వారా కూడా లోకేష్‌కు అనేకమార్లు సమాచారం అందించినా పట్టించుకోలేదన్నారు. పెండింగ్ నిధుల గురించి గతంలో కూడా ప్రతి జిల్లాలో కలెక్టర్‌లకు వినతి పత్రాలు ఇచ్చామని గుర్తు చేశారు. ప్రభుత్వం పరిష్కరించాల్సిన డిగ్రీ కళాశాలల అకడమిక్ సమస్యలు కూడా చాలానే ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. డిగ్రీ కాలేజీలు నిర్వహించాలంటే సిబ్బంది జీతభత్యాలు, రవాణా, కళాశాల నిర్వహణ వంటి వ్యయ ప్రయాసలతో కూడిన ఆర్థిక సమస్యలు భరించలేక సతమతమవుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం విద్యార్థుల నుంచి ఎటువంటి ఫీజులు వసూలు చేయరాదని ఆదేశాలు ఇచ్చిందని, ఇలాంటి పరిస్థితుల్లో అటు ప్రభుత్వం పెండింగ్ ఆర్‌టీఎఫ్ నిధులు ఇవ్వకుండా, ఇటు కళాశాలలు ఫీజులు వసూలు చేసుకోకుండా, కళాశాలలు ఏ విధంగా నడపాలో దిక్కుతోచని స్థితిలో ఉన్నామని చెప్పారు. డిగ్రీ విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని పెండింగ్ నిధులు అంశాన్ని ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లాలనే ఉద్దేశంతో ధర్నా చేస్తున్నట్లు పేర్కొన్నారు.

మీ కోసం కార్యక్రమానికి మూడు అర్జీలు

సంతనూతలపాడు (చీమకుర్తి రూరల్): సంతనూతలపాడు రెవెన్యూ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన మీ కోసం కార్యక్రమానికి మూడు అర్జీలు వచ్చినట్లు తహసీల్దార్ ఎస్.ఎల్.నారాయణరెడ్డి తెలిపారు. ఒకటి పట్టాదారు పాస్ పుస్తకానికి, మరో రెండు అర్జీలు సర్వే కొలతలకు వచ్చినట్లు వెల్లడించారు. మండల పరిషత్ ఏవో శారద, హౌసింగ్ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ చెన్నరాయుడు, వెలుగు ఏపీఎం టి.బాబూరావు, ఎంఈఓ డి.వెంకారెడ్డి, ఎన్ఆర్ఈజీఎస్ మండల ఏపీవో వాసంతి, ఐసీడీఎస్ మండల సూపర్‌వైజర్లు సావిత్రి, పార్వతీబాయ్, ఆర్‌డబ్ల్యూఎస్ ప్రతినిధి ఎం.సుబ్బారావు, వ్యవసాయ శాఖ ప్రతినిధి సుబ్బారెడ్డి పాల్గొన్నారు.